
మినీ కథ

# చేపలు



ఎత్యాల సాంబశివరావు

నా ఫ్రెండు దుర్గారావు చాలా హడావిడి మనిషి. చలాకీగా వుంటాడు. చిలిపిగా మాట్లాడతాడు. టౌన్‌కి ఓ పది మైళ్ళ దూరంలో వుంది వాళ్ళ ఊరు. వాడు వారం పదిరోజులకోసారి టౌన్‌కొచ్చి కావల్సినవన్నీ కొనుక్కుపోతుంటాడు. లేపోతే సరదాగా వచ్చి ఓ సినిమా అన్నా చూసి పోతాడు. ఇంతకీ వచ్చిన చిక్కేమిటంటే, వచ్చిన ప్రతీసారి నేను కనపడితే పట్టుకుపోతాడు. నేను కూడా తిరగాల్సిందే వాడి కూడా. ఎక్కడికెళ్తే అక్కడకు నేనూ పోవాల్సిందే. అయితే, వాడితో కాలక్షేపం బాగానే వుంటుంది.

ఓ రోజు...

ఇంటికి వచ్చేటప్పటికే ఓ సంచి సామానుతో దిగాడు. మా ఇంటికి బస్ స్టాండ్ దగ్గర. అందుకే బరువైన సామాన్లుంటే ఇంటి దగ్గర పడేసి తిరిగొస్తాడు. ఆఖరున అన్నీ తీసుకొని బస్సెక్కుతాడు.

నేను దొరికిపోయాను. మంచినీళ్ళుతాగి 'పదరా పదంటూ' బయల్దేరదీశాడు. సరేనని, సైకిలు తీసుకొని బయలుదేరా. పైగా వాడివి సైకిలు మీద ఎక్కించుకొని తొక్కాలి. అయిదారు షాపుల దగ్గర ఫ్యాన్సీ, కిరాణా, ఎలక్ట్రికల్ వగైరా, వగైరా సామాన్లు కొన్నాడు. ఈ మధ్య వాడికో హాబీ ఎక్కువగా జత అయింది— మిగతా హాబీలకి. వాడుచేపలు అక్వేరియంలో పెంచుతున్నాడు. దానిని గురించి ఎంత ఎడ్మిరేషన్‌తో మాట్లాడుతాడో!

"ఒరేయ్! అక్వేరియం ముందు కూర్చుంటే గంటలు క్షణాలుగా గడిచిపోతయ్‌రా! అబ్బ! ఎంత ముద్దొస్తయిరా చేపలు. అవి నాజూకుగా ఈదుతుంటే చూడాలి! ఒక్కోసారి కదలకుండా గాలిలో నిలబడినట్లు నిల్చిపోతయ్. వాటికి మేత వేసినపుడు చూడాలి! ఎలా ఎగబడ్తయ్యో! అవీ ప్రాణులే గదరా! మొన్న రామవరంలో మన ఫ్రెండ్ - అదే లెక్చరయ్య—ముత్తయ్య ఇంటి దగ్గర నుంచి మూడు ఫారెన్ ఫిష్ తెచ్చా. ఎరుపు, పసుపూ కలర్స్. లైటింగ్‌లో వాటిని చూస్తుంటే...", అంటూ చెప్పేవాడు. ఆ చేపల పేర్లు కూడా నాకు తెలిసేవికావు. నాకు పెట్స్, గిట్స్ అంటే మంట! మనుషుల గురించి ముందు చూడరుగానీ, పిల్లులు, కుక్కలు—వాటికి పేర్లు, పుట్టిన రోజులు... ఇవన్నీ నాకు గిట్టదు. సరే అంటూ 'ఊ' కొట్టేవాణ్ణి వాడి సరదకు.

ఓ రోజున ఓ చేప చచ్చిపోయినందుకు కంటనీరు పెట్టుకున్నాడు. ఆ చేప ఫస్ట్ తెచ్చిన బ్యాచ్‌లోదట. అన్నిటి కంటే అదే ఫుడ్ ఎక్కువ తినేదట; ఎక్కువ నిద్రపోయేదట. ఇవన్నీ చెప్పి ఇదయిపోయాడు. వెంటనే నేను వాడి దృష్టిని రాష్ట్ర రాజకీయాలవైపు మళ్ళించి, మర్చిపోయేట్లు చేసేను.

ఆ రోజుతో ఇంట్లో వున్న 'ఫిష్ ఫుడ్' అయిపోయిందట. చూసుకోలేదట. చేపలకు 'ఈస్ట్' కాబోలు వేస్తారు. దాని కోసం ఓ మందుల షాపు కెళ్ళాం. లేదన్నాడు. అలా సుమారు డజను షాపులు తక్కువ కాకుండా అడిగాం. అప్పటికే తొమ్మిదయి పోతోంది. ఇంక షాపులు కట్టేస్తారు. అసలు ఈ మధ్యనే స్టాక్ రాలేదన్నారు మందుల షాపువాళ్ళు. నాకో ఐడియా వచ్చింది — ఎక్వేరియం ఎవరింట్లో వుందో తెలుసుకొని వాళ్ళ ఇంటికెళ్తేసరి! ఆ మాటే అన్నా వాడితో! వాడికి వాడి ఫ్రెండ్ ఒకడు గుర్తొచ్చాడు. వాళ్ళ ఇల్లు కనీసం మైలున్నర వుంటుంది—షార్ట్‌కట్‌లో. దుర్గాగాడి ముఖం చూస్తుంటే ఆదుర్దాగా వుంది. విసుగ్గానూ వుంది. అక్కడయినా దొరుకుతుందో లేదో?

సరే, సైకిల్ మీద డబుల్స్ మాగ్జిమమ్ స్పీడ్ (నా ఓపికను బట్టి)తో వాడి ఫ్రెండ్ ఇంటికెళ్ళాం. నాకు ఆయాసం, చెమటలు! వాడి ఫ్రెండ్ ఆదరంగా పిలిచి కూర్చోపెట్టి, కాస్త ఐస్‌వాటర్ ఇచ్చాడు. దాంతో నేను కాస్త కూలయ్యా. వాళ్ళ ఇంట్లో కూడా ఈస్ట్ లేదట! అయితే, ఏదో ఫుడ్ ప్రిపేర్ చేశార్ట తవుడుతో. ఆ మాటవిని పరమానందభరితుడయ్యాడు దుర్గారావు. వాళ్ళిద్దరూ చేపల గురించి ఓ అరగంట తీరిగ్గా మాట్లాడుకొన్నారు. నాకు వాళ్ళు మండిపోతోంది. ఇంటికి మరీ లేట్‌గా వెళ్తే తిట్లుతప్పవ్! ఆ ఫుడ్ కాస్త పొట్లాం కట్టించుకొని వెనక్కి బయలుదేరాం. వాడు ఏవో త్రేన్పులు త్రేనుస్తున్నాడు. ఇంకా తెరచివున్న మందుల షాపు ఒకటి కనపడడంతో ఆపమన్నాడు సైకిల్.

"ఇంక దేనికిరా?" అన్నా.

"డైజీన్ టాబ్లెట్స్ రెండు వేసుకోవాల్రా" అన్నాడు.

"ఎందుకురా? అజీర్తా? ఇదెప్పట్నించి?" అడిగా.

"అబ్బేకాదురా. ఇవాళ కూర అరగలేదురా! మళ్ళీ వెళ్ళిం తర్వాత సరిగ్గా భోంచెయ్యాలిగదా! అసలే భోజనం లేకపోతే వుండలేను. అంతేకాక ఇవాళ స్పెషల్ కూడాను" అన్నాడు. అంటూనే వెళ్ళి నాలుగు బిళ్ళలు కొనుక్కొని, రెండు నోట్లో వేసుకొని నములుతూ వచ్చాడు. ముఖం సంతృప్తితో నిండివుంది.

"ఇంతకీ ఏంట్రా స్పెషల్?"

"చేపలురా...బొచ్చెలు. నాకెంత ఇష్టమో!" అన్నాడు వాడు, బొచ్చె చేపలకూర గుర్తుతెచ్చుకొని గుటకలు మింగుతూ.